## నెలవారి నేర సమీక్షలో ఎస్పీ




**నెల్లూరు క్రైమ్, నవంబర్ 10, ప్రభాతవార్త** నగరంలోని స్థానిక ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలు, ఇతర కేసుల నమోదు, ఛేధనల గురించి సర్కిల్ వారీగా పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించి, సీడీ ఫైల్స్ క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతలను పరిరక్షించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించి, ప్రజాజీవన విధానంలో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పడం మన బాధ్యత,పోలీసు సంక్షేమంలో భాగంగా నవంబర్ 15న ఓఈ(ఒరల్ ఎంక్వయిరీ) మేళాను నిర్వహిస్తున్నట్లు సిబ్బంది వినియోగించుకోవాలని సూచించారు. సంబంధిత పోలీసు అధికారి వారానికి కనీసం రెండు గ్రామాల సందర్శన తప్పనిసరి అని స్పష్టం చేశారు. ప్రజలతో మమేకమై వారితో స్నేహభావంతో సహాయకారిగా మెలిగినప్పుడు పోలీసులు పట్ల సదాభిప్రాయం ఏర్పడి పోలీసుల పట్ల విశ్వాసం పెరుగుతుందని వివరించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయండి.. ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాలపై ఓవర్‌లోడ్, ట్రిపుల్ రైడ్, హెల్మెట్ లేకుండా, రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులపై ఈ చలానా ద్వారా జరిమాన విధించాలని పేర్కొన్నారు. ఫాస్ట్ ట్రాక్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి ముద్దాయిలకు శిక్ష పడేలా చూడాలని తెలిపారు. బాణ సంచా తయారీ కేంద్రాలు, స్టోరేజ్ గోడౌన్స్, మందు గుండు సామాగ్రి విక్రయించే దుకాణాలను, పరిసర ప్రాంతాల భద్రతాపరమైన ప్రామాణికలను పాటిస్తున్నారా లేదా క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఓఎస్ కాల్స్ వచ్చిన వెంటనే స్పందించి, సంఘటనా స్థలానికి చేరుకోవాలని, కేసుల చేదింపునకు, పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు, మెలుకువలను అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసులు, హత్య కేసులు, పీఓసీఎస్ఓ అండ్ రేప్ కేసులు, డెకాయిటి, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, మిస్సింగ్, చీటింగ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 సీఆర్ పీసీ కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, డీపీఓకు సంబంధించి పెండింగ్ రిప్లై ఫైల్స్, పెండింగ్ ఎన్‌బీడబ్ల్యూఎస్, ఎన్‌డీపీఎస్ కేసులలో దర్యాప్తు, రికవరీల గురించి సర్కిల్ వారీగా పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. దర్యాప్తు భాగా చేసిన, ముద్దాయిలను సత్వరమే అరెస్టు చేసి పెండింగ్‌లో ఉన్న కేసులను తగ్గించుటలో ప్రతిభ కనపరిచిన అధికారులు, సిబ్బందిని అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేసిన జిల్లా ఎస్పీ. ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్), క్రైమ్, ఏఆర్, లీగల్ అడ్వైజర్, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## జెడ్పీలో ఏడుగురికి కారుణ్య ఉద్యోగ నియామకాలు



**నెల్లూరు అర్బన్, నవంబర్10, ప్రభాతవార్త** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జూనియర్ సహాయకులుగా కారుణ్య నియామక ఉత్తర్వులను సంబంధిత అధికారులు శుక్రవారం అందజేశారు. రాపూరు మండలంలో సీనియర్ ఉపాధ్యాయులుగా పని చేస్తూ షేక్.జబ్బర్ గత కొన్ని సంవత్సరాల క్రితం గుండెపోటుతో మరణించారు. ఆయన ప్రథమ కుమార్తె కారుణ్య ఉద్యోగ నియామకం కోసం ధరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో జిల్లా పరిషత్‌లో జూనియర్ సహాయకులుగా కారుణ్య నియామకం ఉత్తర్వులు అందజేశారు. జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాల కింద 7గురికి ఇవ్వడం జరిగింది. వారిలో 1జూనియర్ సహాయకులు, 6 మందికి ఆఫీస్ సబార్డినేట్‌గా కారుణ్య నియామకాల కింద జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చిరంజీవి సంయుక్తంగా కారుణ్య నియామకం కింద ఉత్తర్వులు అందజేశారు. వారికి పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి లక్కాకులు పెంచలయ్య, భోగ్యం రమేష్‌బాబు వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నియామక ఉత్తర్వులు పొందిన షేక్.షకీరా, సీహెచ్ గీతిక, లోకేష్‌సాయి, శ్యారదా, కృష్ణకుమార్, రామణమ్మ, రేవతి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జడ్పీ సీఈవో చిరంజీవిలకు మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలను అందించి శాలువాకప్పి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి




**నెల్లూరు కార్పొరేషన్, నవంబర్10, ప్రభాతవార్త** ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికై బాల్య వివాహాలను నిర్మూలించాలని, వివాహ చట్టాలపై ప్రజల్లో చైతన్యం పెంచాలని నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ స్రవంతి జయవర్ధన్, కమిషనర్ వికాస్‌మర్మత్, సీనియర్ సివిల్ జడ్జి వాణిలు పేర్కొన్నారు. బాల్యవివాహ నిరోధన, పర్యవేక్షణ నగరపాలక సంస్థ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం కార్పొరేషన్ లోని ఏపిజె అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిరోదక చట్టంపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల చట్టం 2020 ప్రకారం వివిధ ప్రభుత్వ విభాగాల అధికారుల, ప్రజాప్రతినిధులతో నగరపాలక సంస్థలో మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసారని వెల్లడించారు. బాల్య వివాహాలకు, నిరక్షరాస్యత, పేదరికం ప్రధాన కారణాలని, నిర్బంధ విద్యను అమలు చేయడం వల్లనే మంచి ఫలితాలు సాధించగలమని తెలిపారు. విద్యార్థి స్థాయిలో బాలికలకు శరీర నిర్మాణశాస్త్రం, వివాహ వయస్సు వంటి సామాజిక అంశాలపై అవగాహక కల్పించి, వారి కుటుంబంలోని పెద్దలతో స్వయంగా వారే అన్ని విషయాలను చర్చించే విధంగా విద్యావ్యవస్థ ఉండాలని వారు ఆకాంక్షించారు. శరీరంపూర్తి స్థాయిలో పరిపక్వత రాని వయస్సులో వివాహాలు చేయడం వల్ల బలహీనమైన సంతానం కలిగే అవకాశ్యాలు చాలా ఎక్కువ అని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. బాల్య వివాహాలను నిరోదించడంతో పాటు, చిన్న వయస్సులోనే గర్భం దాల్చిన బాలికలను గుర్తించడాన్ని ప్రధాన లక్ష్యంగా చేసుకునేలా కార్యాచరణ ప్రణాళికలన కమిటీ రూపొందించాలని వారు సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, వైద్యాధికారులు, పోలీస్ విభాగం, సామాజిక కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, మెప్మా, నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కారం




**సైదాపురం, నవంబర్ 10, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కారం చెందుతాయని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ పేర్కొన్నారు. స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ సమస్యలు పరిష్కారం చెందేందుకు అర్జీలను స్వీకరించారు. ప్రజల నుండి అందిన అర్జీలపై సంబంధిత అధికారులకు నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను శాశ్వితంగా పరిష్కరించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న శాశ్విత భూ హక్కు, భూ రక్ష కార్యక్రమం ద్వారా భూముల రీసర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కరించాలనే లక్ష్యంతో మండల కేంద్రాల్లో ముందుగానే షెడ్యూల్ ప్రకటించి ప్రతి బుధ, శుక్రవారం జగనన్న చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రానికి రాలేని గ్రామాల ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించడం, సంతృప్తికర స్థాయిలో పరిష్కరించేందుకు మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైదాపురంలో వివిధ సమస్యలు పరిష్కారం కొరకు 123 అర్జీలను ప్రజలు అందించారని అన్నారు. వీటిలో ఎక్కువగా మ్యుటేషన్‌లు, ఎఫ్‌లైన్ సర్వే, అసైన్డ్‌మెంట్ పట్టాలు కావాలని అర్జీలు అందినట్లు తెలిపారు. ఎక్కువగా రెవెన్యూ సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారని, వీటిని క్షుణ్ణంగా పరిశీలించి సత్వరం పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ చిరంజీవి, నెల్లూరు ఆర్డీఓ మలోల, డీడబ్ల్యూఎంఏ పీడీ వెంకటరావు, డీఈఓ గంగాభవాని, జిల్లా వ్యవసాయాధికారి సుధాకరరాజు, హౌసింగ్ పీడీ నాగరాజు, పశుసంవర్ధకశాఖ జేడీ మహేశ్వరుడు, ఫిషరీస్ జేడీ నాగేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ హేనసుజన్, ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు, తహశీల్దార్ శ్రీనివాసులు, ఏవో పురుషోత్తం శివకుమార్, వ్యవసాయశాఖాధికారిణి హైమావతి, ఏపీఎం రాధమ్మ, జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## మెమో రైళ్లు మళ్లీ రద్దు

**బిట్రగుంట, నవంబరు 10 ప్రభాతవార్త** విజయవాడలో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా పలు మెమో రైళ్లను మళ్లీ రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. బిట్రగుంట-విజయవాడ మధ్య నడిచే 07977 రైలును, విజయవాడ-బిట్రగుంట మధ్య 07978 రైలును, బిట్రగుంట-గూడూరు మధ్య నడిచే 075200 రైలును 13 నుండి 19వ తేది వరకు రద్దు చేశారు. బిట్రగుంట నుంచి చెన్నై సెంట్రల్‌కు వెళ్లే 17237 రైలును, చెన్నై సెంట్రల్ నుండి బిట్రగుంట వరకు నడిచే 17238 రైలును ఈ నెల 13వ తేది నుండి 17వ తేది వరకు, గూడూరు నుంచి విజయవాడకు వెళ్లే 07458 మెమో రైలును ఈ నెల 14వ తేది నుండి 20వ తేది వరకు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# సంక్షేమ అభివృద్ధి వైసీపీతోనే సాధ్యం



**కోవూరు, నవంబరు10ప్రభాతవార్త :** రాష్ట్రంలో వైసీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం వేగంగా జరుగుతున్నాయని, రాజ్యసభ సభ్యులు జిల్లా వైసీపీ అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కోవూరు మండలం వేగూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సీతారామపురం గ్రామంలో 30 లక్షల వ్యయంతో నిర్మించి సిమెంట్ రోడ్డు పనులను కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గరకు వచ్చే సరికి ప్రతిపక్షాలు రకరకాల వేషాలతో ముందుకు వస్తారని, అటువంటి వారి మాటలను నమ్మ వద్దన్నారు. ప్రజల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కోవూరు నియోజకవర్గాన్ని అన్నింటా అభివృద్ధి చేయడంలో ప్రసన్నకుమార్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులను తీసుకువస్తున్నారన్నారు. అది ఆయన ఒక్కడికే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రసన్న కుమార్‌రెడ్డిని గెలిపించేలా ప్రతి ఒక్కరూ సమిష్టి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు వీరాంజనేయస్వామి ఆలయంలో సాంప్రదాయ బద్దంగా ప్రత్యేకపూజలు నిర్వహిం చారు. రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్ బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, విజయడెయిరీచైర్మన్ కె. రంగారెడ్డి, నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్. మల్లి కార్జున్‌రెడ్డి, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండలవ్యవసాయసలహామండలి చైర్మన్ హరి ప్రసాద్‌రెడ్డి, సీసీఎస్ క్యాటరింగ్ అధినేత చంద్ర శేఖర్. సొసైటీ డైరెక్టర్ జనార్ధన్, నేతలు మహేష్, కె.ప్రసాద్, చిరంజీవి, నరసింహ, ఉన్నారు.

# దీపావళి అందరికి వెలుగులు నింపాలి



**నెల్లూరు క్రైమ్, నవంబర్ 10, ప్రభాతవార్త** నగరంలోని స్థానిక ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి పత్రికా సమావేశం నిర్వహించి సాధ్యమైనంతవరకు కాలుష్య రహిత టపాసులనే కాల్చాలని సూచించి, అందరూ ఆనందంగా ముందు జాగ్రత్త చర్యలతో ప్రశాంత వాతావరణంలో దీపావళి పండుగ జరుపుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి బాణసంచా తయారీ, విక్రయించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో బాణసంచా తయారీ విక్రయాలు చేసే వారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండి, ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి బాణసంచా విక్రయించాలని, ముందస్తు జాగ్రత్త చర్యల వలనే ప్రమాదాలను నివారించగలమని తెలిపారు. జిల్లాలో అక్రమంగా తయారయ్యే టపాసులు, సరఫరా, విక్రయాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా, అతిక్రమించి విక్రయించినా చట్ట ప్రకారం శిక్షార్హులు అని పేర్కొన్నారు. ప్రజల శ్రేయస్సు కొరకు బాణసంచా తయారీ కేంద్రాలు, స్టోరేజ్ గోడౌన్స్, మందు గుండు సామాగ్రి విక్రయించే దుకాణాలను, పరిసర ప్రాంతాల భద్రతాపరమైన ప్రామాణికలను పాటిస్తున్నారా లేదా క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించి జిల్లా ఎస్పీ బాణసంచా వంటి పేలుడు పదార్థాలు ఇంట్లో నిల్వ ఉంచరాదు.. బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత ప్రమాణాలు మేరకు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసుకొని విక్రయించుకోవాలి, బాణసంచా విక్రయ/ తయారీ లైసెన్సు కలిగిన దుకాణదారులు ప్రమాదాలు నివారణ కొరకు పాటించాల్సిన నియమ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫైర్ సేఫ్టీ ప్రికాషన్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతి దుకాణం వద్ద రెండు అగ్ని నిరోధక సిలిండర్లు, రెండు బకెట్ల పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలి, బాణసంచా సామాగ్రి తయారీ, నిల్వ కేంద్రాలు నివాస ప్రాంతాలకు, విద్యాసంస్థలకు హాస్పిటల్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఫైర్ అలారం సిస్టం ఏర్పాటుతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించేలా ఆయా కేంద్రాల వారికి అవగాహన కలిగించారు. మందుగుండు విక్రయ కేంద్రాలను అధికారులు అనుమతించిన ప్రదేశంలోనే ఏర్పాటు చేయాలని, 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారిని మందుగుండు సామాగ్రి తయారి, నిల్వ కేంద్రాలలో పనిచేయించరాదన్నారు. బాణసంచా దుకాణాలకు దూరంలో వాహనాలను నిలుపుకునేలా చూసుకోవాలన్నారు. ఆయా కేంద్రాలలో పనిచేసే వారికి ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, నిల్వల సమాచారం ఉంటే స్థానిక పోలీసులకు లేదా పోలీసు డయల్ 112 ద్వారా పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

# ప్రజాధనాన్ని కొల్లగొడుతున్న దోపిడీదారుడు కాకాణి



**నెల్లూరు నవంబర్ 10, ప్రభాతవార్త-వైద్యం** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజా ప్రతినిధులపై 146 కేసులు ఉన్నాయని, అందులో సీఎం జగన్‌పై 12 పైచిలుకు కాగా, వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మీద 8 కేసులు ఉన్నాయని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో సోమిరెడ్డి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రాలో ప్రజా ప్రతినిధులపై ఉన్న అపరిష్కృతం కాని 50 కేసులు ఉన్నాయని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సుప్రీంకోర్టు జడ్జి చంద్రచూడ్ అన్నారన్నారు. గతంలో సర్వోన్నత న్యాయస్థానం ఎమ్మెల్లేలు, మంత్రులు, సీఎం, పిఎంలు అయినా ఏడాదిలో ఆకేసులకు తీర్పు ఇవ్వాలనే చట్టం ఉందన్నారు. అది జరగలేదు కాబట్టే జగన్‌మోహన్‌రెడ్డి లాంటి హత్య, దగాకోరు, దోపిడీ, ఆర్థికనేరగాడు రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు క్విడ్‌ప్రోకోని పరిచయచం చేసి భారీగా దోపిడీ చేసి మరలా సీఎం అయ్యాడన్నారు. త్వరతగతిన కేసులు పరిష్కారం కాలేదు కాబట్టే జగన్, కాకాణి లాంటి వాళ్ళు ఇంకా బయట ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ మద్యం కేసు 10 ఏళ్ళు, నకిలీ పత్రాలు 8ఏళ్ళు అయ్యాయని ఏదిఏమైనా నాకు ఇతర దేశాల్లో రూ.1000కోట్లు ఆస్తులున్నాయనే కేసులో మాత్రం ఎట్టి పరిస్థితుల్లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి జైలుకు పోవడం తథ్యమన్నాని సోమిరెడ్డి చెప్పారు. సుప్రీంకోర్టు అప్పుడే తీర్పు ఇచ్చిఉంటే అప్పుడే జైలుకు పోయిండేవాడని, తీర్పు ఇవ్వలేదు కాబట్టే ఈనాడు ఆయన మంత్రి అయ్యాడని ఆరోపించాడు. నాపైన 31 కేసులు ఉంటే కాకాణి మీద 8కేసులు మాత్రమే ఉన్నాయనే ఆలోచనతో జగన్ కాకాణికి మంత్రి పదవి ఇచ్చాడని ఏద్దేవా చేశాడు. శాఖ, నియోజకవర్గం, క్వాడ్జ్, మట్టి, ఎట్టిమట్టి, థర్మల్ స్టేషన్‌లో ఉండే బూడిద సైతం దోచుకుంటూ ప్రజాధనాన్ని కొల్లగొడుతున్న దోపిడీదారుడు గోవర్ధన్‌రెడ్డని మండిపడ్డాడు. గోవర్ధన్‌రెడ్డి కోట్లాది రూపాయాలు సంపాదించాడని ఈ కేసులన్నింటినీ ఎట్లా మేనేజ్ చేస్తాడో తెలియదు కాని నాకేసులో మాత్రం జైలుకు వెళ్ళాల్సిందేనని ఖరాఖండిగా సోమిరెడ్డన్నారు. మిగతా అన్నికేసుల్లో కూడా ఆయనకు లైఫ్‌టైమ్ శిక్షపడే అవకాశాలున్నాయన్నారు. అసైన్‌మెంటు కమిటీ ఆధ్వర్యంలో అర్హులైన వారిని విచారించి పట్టాలు ఇవ్వాలని అవేమీ లేకుండా, గ్రామసభలు పెట్టకుండా 4,313ఎకరాలు పట్టాలను ఏలా ఇచ్చారని ప్రశ్నించారు. ఒక్క సర్వేపల్లిలో 3,379ఎకరాలు ఎలా గోవర్ధన్‌రెడ్డి ఇచ్చాడన్నారు. కందుకూరు, కావలి, ఉదయగిరి, ఆత్మకూరు, వెంకటగిరి, ఈ ఐదు నియోజకవర్గాల్లో కలిపి 933 ఎకరాలు ఇచ్చాడన్నారు. ఇప్పటికే నీ బాధితులు ఈ భూకుంభకోణంలో 5మంది జైలుకు పోయ్యారని, స్వాతి తాహశీల్దారు సస్పెండ్ అయి ఇంట్లో ఉంది, డిఎఫ్ఓ మంగమ్మ పనిష్మెంట్ ఎదుర్కొంటున్నారు. త్వరలోనే మరో ఎమ్మార్వో సస్పెండ్ కాబోతున్నాడని అందులో ఎలాంటి అనుమానం లేదని, పొదలకూరులో సీఐ, ఎస్పై సెలవు మీద వెళ్ళిపోయారని సోమిరెడ్డి ధ్వజమెత్తారు. సర్వేపల్లి నియోజకవర్గంలో రెవెన్యూలో ఎన్నో అవతవకలు జరుతుంటే కలెక్టర్, జాయింట్ కలెక్టర్, కమిషన్ ఆఫ్ ల్యాండ్ రెవెన్యూ ఎమి చేస్తున్నాడన్నారు. 3,379ఎకరాల్లో అర్హులైన ఏ ఒక్కరైనా వైసీపీ కాకపోయినా అర్హులైన టీడీపీ వాళ్ళకి కనీసం ఒక్క ఎకరా అయినా ఇచ్చామని చెప్పాలని సోమిరెడ్డి డిమాండ్ చేశాడు. 2018లో సీజేఎఫ్ భూములను 70వేల ఎకరాలు ఎక్కడ కూడా ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఇచ్చామన్నారు. సర్వేపల్లి చెరువు అన్యాక్రాంతంపై నేడు లోకాయుక్త విచారణకు వచ్చిందని గోవర్ధన్‌రెడ్డి దోచుకువడం దాచుకోవడమే పనిగా పెట్టుకున్నాడన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత రెవెన్యూ కాకాణి గోవర్ధన్‌రెడ్డి కాళ్ళ కింద నగిలిపోతున్నాయని ఆయన ఆగ్రహాన్ని వ్యక్తంచేశాడు. చెరువులు, వంకలు, వాగులకు అక్రమించకూడదని సుప్రీంకోర్టు గతంలోనే చెప్పుందన్నారు. సర్వేపల్లి భూములు పంపిణీలో న్యాయవిచారణ చేసి అర్హులైన అందరికి ఇవ్వాలని కలెక్టర్‌ని డిమాండ్ చేశారు. సమాచారం చట్టం కింద అసైన్‌మెంటు మీద ఇచ్చిన తీర్మానాలు ఇమ్మంటే కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు వాళ్ళ సొంత ఆస్తుల వివరాలు అడిగినట్లు ఇప్పటి వరకు అడిగిన సమాచారాన్ని ఇవ్వలేదని మండిపడ్డారు. ఐఎఎస్, ఐపీఎస్‌లు ప్రజల కట్టే పన్నులతో జీతాలు అందుకుంటున్న వారు, న్యాయంగా వారికి చేయాల్సింది చేయకుండా వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులకు వత్తాసు పలుకుతున్నారని దుయ్యబట్టారు. వచ్చేది టీడీపీయేనని అన్యాయం, అవినీతికి పాల్పడిన ఏ ఒక్కరిని వదలమని ఆయన హెచ్చరించాడు. దయచేసి కోర్టు మెట్లు ఎక్కే పరిస్థితి తెచ్చుకోకండని కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు చంద్రమోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశాడు. గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకి దమ్ము, ధైర్యం ఉంటే 4,313ఎకరాల వివరాలను కలెక్టర్ కార్యాలయం వద్ద పెట్టాలని సవాల్ విసిరారు. పోలీసులు చెలరేగిపోతున్నారని, ఆ ఖాకీ చొక్కాని కాకాణి గోవర్ధన్‌రెడ్డి కాపాడలేదని ఆయన పేర్కొన్నారు. ప్రతి అధికారి నీతినిజాయితీగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఆయన అధికారులకు సూచించారు.

# రాష్ట్రంలో విప్లవాత్మకమైన పాలన సాగుతుంది




**కోవూరు, నవంబరు10ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో విప్లవాత్మకమైన పాలన సాగుతుందని, ప్రజల ముంగిటికే పథకాలు అందించిన ఘనత ఆయనకే దక్కిందని రాజ్యసభ సభ్యులు, జిల్లా వైసీపీ అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కోవూరు మండలం వేగూరు గ్రామంలో వైసీపీ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి వస్తేనే రాష్ట్ర మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు జన్మభూమి కమిటీలు చెప్తేనే మంజూరు అయ్యేవని, ప్రస్తుతం అర్హత ఉంటే పార్టీలకు అతీతంగా పథకాలు అందుతున్నాయన్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు లక్షల కోట్లు ఖర్చు పెట్టిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లుతో కలిసి పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిలో లక్ష రూపాయల నుంచి 10 లక్షల వరకు ప్రభుత్వం ద్వారా నిధులు నేరుగా వారి ఖాతాలో జమ చేసిన పరిస్థితి గతంలో ఏ ప్రభుత్వంలో లేదన్నారు. పేద , బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అటువంటి వ్యక్తి మరలా పాలనలోకి వస్తేనే ఈ పథకాలు అమలు అవుతాయన్నారుఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కె. రంగారెడ్డి, నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ అధినేత వసంత్‌కుమార్‌రెడ్డి,, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, సీసీఎస్ క్యాటరింగ్ అధినేత చంద్రశేఖర్. సొసైటీ డైరెక్టర్ జనార్ధన్, ఇనమడుగు సర్పంచ్ ప్రమీలమ్మ, స్తపతి సురేంద్ర, అమర్, నేతలు మహేష్, కె.ప్రసాద్, చిరంజీవి, నరసింహ,తదితరులు ఉన్నారు. .

## 27 వరోజు శ్రీలిలతా రుద్రయజ్ఞం



**సంగం నవంబర్ 10 ప్రభాతవార్త** సంగం తిరమనకొండ రాజరాజేశ్వరీదేవి కాశీవిశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో శ్రీలలితారుద్రయోగం 27 వ రోజుకు చేరుకుంది. పీఠాదిపతి శ్రీరాజరాజేశ్వరనందస్వామి శ్రీలిలతారుద్రయోగం యొక్క విశిష్టత గురించి తెలియజేశారు. లోకకళ్యాణార్ధం, పాడిపంటలు సశ్యశ్యామలంగా ఉండాలని ఈ లలితారుద్రయాగం నిర్వహిస్తున్నట్లు స్వామి జి తెలిపారు. అమ్మలగన్న శ్రీలలితాదేవిని శ్రీమాత్రేయనమః అంటు కీర్తించిన వారికి సకల శుభాలు జరుగుతాయని స్వామి వివరించారు. ఈయాగంలో పాలోన్నవారికి అమ్మవారి కృఫాకటాక్షలు కలుగుతాయని చెప్పారు. ప్రజలు శ్రీలలితాహోమంలో పాల్గోని అమ్మవారి కృపకు పాత్రలు కావాలని స్వామిజి వివరించారు. హోమం అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

## రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలు గల్లంతు




**కోవూరు, నవంబరు10ప్రభాతవార్త :** రాష్ట్రాన్ని అన్నీ రంగాల్లో అభివృద్ధి పథంలో పయనింపజేస్తూ భారతదేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా ప్రజల వద్దకే పాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మో హన్‌రెడ్డినే అని ప్రజాప్రతినిధులు, నేతలు కొనియాడారు. కోవూరు పంచాయతీ పరిధిలోని పెళ్లకూరు కాలనీ సచివాలయం-2లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందు, జగనన్నే మా నమ్మకం అనే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏ పథకం రావాలన్నా జన్మభూమి కమిటీలకు ముట్టచెప్తేనే మంజూరు అయ్యేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఉంటే నేరుగా పథకాలు వారి ముంగిటికే చేరుతున్నాయన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు సరైన నిధులు లేక కళావిహీనంగా ఉండేవన్నారు. ప్రస్తుత వైసీపీ పాలనలో నాడు-నేడు ద్వారా ఆ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్ పీఎం కిసార్ రైతుభరోసా ద్వారా ప్రతి సంవత్సరం రూ. 12,500 రూపాయలు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం కింద నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. ప్రజలు గత ప్రభుత్వం తీరు, ప్రస్తుతం వైసీపీ పాలనను బేరీజు వేసుకోవాలని పిలుపునిచ్చారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల వారు వారి రాష్ట్రంలో అమలు చేస్తున్నారని, ఈ క్రెడిట్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఇటువంటి సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు మరలా గెలిపించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ప్రాంగణంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం డిస్‌ప్లే బోర్డును ప్రజా ప్రతినిధులు, నేతలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, ఉపసర్పంచ్ మైనుద్దీన్, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిషోర్‌సింగ్, నేతలు కె. ప్రసాద్, శివకుమార్‌రెడ్డి, చిరంజీవి, అంజన్‌రావు, శివకోటారెడ్డి, రమేష్, శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, పార్వతి, తదితరులు ఉన్నారు.

## శరవేగంగా ఆలయ నిర్మాణ పనులు



**కోవూరు, నవంబరు10ప్రభాతవార్త :** కోవూరు మండలం కొత్తూరు గ్రామంలో వెలసి ఉన్న కోదండరామ స్వామి దేవస్థానంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ నిధులు 12 లక్షల వ్యయంతో మంజూరైన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రాజమండ్రి నుంచి వచ్చిన శిల్పులు ఈ ఆలయాన్ని జీర్ణోద్ధరణ పనులను మరింత వేగవంతం చేయడమే కాకుండా ఆకర్షణీయంగా తీర్చిదిద్దేలా తగుచొరవ తీసుకుంటున్నారు. రెండు నెలలులోగా ఈపనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు తెలిపారు.

## 5 గంటల పాటు నేడు విద్యుత్ కోత



**కోవూరు, నవంబరు 10 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి 2 గంటల వరకు కోవూరులోని 33 కేవీ లైన్ ఇంటర్‌లింక్ లైన్ వర్క్ కార్యక్రమాలు చేపడుతున్న దృష్ట్యా వివిధ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో డీఈ సతీష్ తెలిపారు. ప్రజలు పై సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, దీనిని గమనించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కోవూరు ట్రాన్స్‌కో పరిధిలోని కోవూరుమండలంపాంతంలో 5 గంటలపాటు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడమే ప్రధాన ఉద్దేశ్యం



**నెల్లూరు నవంబర్ 10, ప్రభాతవార్త-విద్య** విద్యార్థులో శాస్త్రీయ దృక్పధాన్ని పెంపొందించేందుకు, సృజనాత్మకతను వెలికితీయడమే చెకుముకి సైన్స్ సంబరాల ప్రధాన ఉద్దేశ్యమని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎన్‌పిసి ఉదయభాస్కర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం రూరల్ నియోజకవర్గ పరిధిలోని భక్తవత్సలనగర్ సెంటర్లో ఉన్న కెఎన్ఆర్ పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలను ఉదయ్‌భాస్కర్ ప్రారంభించారు. ఈ చెకుముకి సైన్స్ సంబరాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం అయ్యాయన్నారు. అందులో భాగంగానే మున్సిపల్ పాఠశాలలోని విద్యార్థుల్లోని టాలెంట్‌ని వెలికితీసేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల స్థాయిలో 8,9,10 తరగతుల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు, గుర్తింపు పత్రాలను ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. తదుపరి విజేతలను జిల్లా, రాష్ట్రస్థాయికి పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రధానోపాధ్యాయులకు జనవిజ్ఞాన వేదిక తరపున ధన్యవాదాలు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, నాయకులు డాక్టర్ కె శ్రీనునాయక్, జెవివి నెల్లూరు నగర కార్యదర్శి మాదాల రాము, మురళి, వీరాస్వామి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అండగా జగనన్న ప్రభుత్వం



**దుత్తలూరు, నవంబర్ 10, ప్రభాతవార్త :** సంక్షేమ పథకాల అమలులో పారదర్శకంగా వ్యవహరిస్తూ వెనుకబడిన వర్గాలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తుందనీ వైకాపా మండల పార్టీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నర్రవాడ సచివాలయ పరిధిలో ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం వచ్చినప్పటి నుండి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటిలు, స్థానిక నాయకులు సిఫార్సు చేసిన వారికే ఫథకాలు అరకొరగా అందేవని ఎద్దేవ చేశారు. ఇచ్చిన హామిల్లో 99 శాతం అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమములో ఎంపిడిఓసాయి ప్రసాద్, ఈఓఆర్డి మురళి మోహన్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ అన్నంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, వెంగన్నపాళెం సర్పంచ్ తిప్పిరి బోయిన పెద్ద వెంగయ్య, బండకిందపల్లి ఉపసర్పంచ్ సుబ్బారెడ్డి, నర్రవాడ పార్టీ సీనియర్ నాయకులు పి. మాల్యాద్రి నాయుడు, తిరివీధి చెన్నకేశవులు, షేక్ మస్తాన్, సొసైటి డైరెక్టర్ దేవరపాటి సురేంద్ర రెడ్డి, గృహ సాంధులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీ పెసర విత్తనాలు పంపిణి

**పొదలకూరు నవంబర్ 10 ప్రభాతవార్త** మండలంలోని మెట్టప్రాంత రైతులకు 30 శాతం సబ్సిడీతో పెసర విత్తనాలను పంపిణి చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వాసు తెలిపారు. మెట్టప్రాంతాలైన మండల పరిధిలోని బిరదవోలు, ఇనుకుర్తి, మొగుళ్ళూరు, ఆర్‌వైపాళెం, వామిటిపర్తి, తోడేరు, మరుపూరు గ్రామాలకు గాను పెసర రకం తొమ్మిది పిఎం-2-14 రకాను 30 శాతం సబ్సిడితో ఆయా రైతు భరోసా కేంద్రాల నందు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాలకు పెసర సాగు చేయబోయే రైతులు ఆయ రైతు భరోసా కేంద్రాల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకొని నగదు చెల్లించినచో ఒక రైతుకు 5 ఏకరాల వరకు విత్తనం సరఫరా చేయబడుతుందని కావునా విత్తనాల కావాల్సినరైతులు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించవచ్చునని తెలిపారు.

## దీపావళి పండుగను జాగ్రత్తగా జరుపుకోండి



**ఉదయగిరి, నవంబర్10, ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని సర్కిల్ పరిధిలో దీపావళి పండుగను పురస్కరించుకుని దీపావళి అంగడులను ఏర్పాటు చేసుకునే వ్యాపారస్తులు సంబంధిత అధికారుల నుండి పరిమీషన్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలని ఉదయగిరి ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐ వి. గిరిబాబు ఆదేశాల మేరకు ఉదయగిరిలోని టపాసు గూడంలను, అంగళ్లను పరిశీలించి వ్యాపారస్తులకు తగిన సూచనలు ఇచ్చామని పట్టణానికి దూరంగా ట్యాంక్‌బండ్ వద్ద అంగళ్లకు అనుమతి ఇచ్చామని తెలిపారు. వ్యాపారస్తులు ప్రమాదాలు జరుగకుండా అగ్నిమాపక పరికరాలు కలిగి ఉండాలని వారు తెలిపారు. అలాగే పండుగ జరుపుకునే ప్రతి ఒక్కరూ ముఖ్యంగా మహిళలు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకుని టపాసులు వినియోగించుకోవాలని ప్రమాదాలకు దూరంగా ఉండి పండుగను సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు.

## శ్రీశ్రీశ్రీ మహబూబ్ సుభాని గంధ మహోత్సవం



**ఉదయగిరి, నవంబర్10, ప్రభాతవార్త** మండలకేంద్రమైన ఉదయగిరిలో శ్రీశ్రీశ్రీ మహబూబ్ సుభాని గంధ మహోత్సవాన్ని ఆర్టీసీ డిపో దగ్గర ఉన్న దర్గాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల అన్నదాన కార్యక్రమం, పకీర్ల మేళతాళాలు, ఎగ్జిబీషన్లతో గంధ మహోత్సవాన్ని నిర్వహకులు ముర్తుజా, కమిటీ మెంబర్లు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్గాలోని మహబూబ్ సుబానీ భక్తులు భారీగా తరలివచ్చి భక్తి శ్రద్దలతో ప్రార్ధనలు నిర్వహించారు.

## గండిపాలెం గ్రామ వాలంటీర్ పోస్టుకు ఇంటర్వ్యూలు



**ఉదయగిరి, నవంబర్10, ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని గండిపాలెం గ్రామంలో ఎస్సీ క్యాటగిరిలో ఖాళీగా ఉన్న వాలంటరీపోస్టుకు అదే గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు ధరఖాస్తు చేసుకున్నట్లు ఎంపిడివో డి. ఈశ్వరమ్మ తెలిపారు. నవంబర్ 10వ తేదీ వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి వారి విద్యార్హతలను ఈఓపిఆర్‌డి మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించనట్లు తెలిపారు. నవంబర్ 11వ తేదీ అన్ని విధాలుగా అర్హులైన ఒకరిని ఎంపిక చేసి వాలంటీర్‌గా నియమిస్తామని డి. ఈశ్వరమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఈవోపిఆర్డి, పంచాయతీ సెక్రటరీ అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పొదలకూరులో ఘనంగా మంత్రి కాకాణి జన్మదిన వేడుకలు



**పొదలకూరు నవంబర్ 10 ప్రభాతవార్త** రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం పొదలకూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక షాదిమంజిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బారీ కేకుకట్ చేసి వైకాపానాయకులకు కార్యకర్తలకు కాకాణి అభిమానులకు పంచిపెట్టారు. అలాగే రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వచ్ఛంధంగా పలువురు కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పొదలకూరు ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతుఈ శిబిరంలో వంద మంది కిపైగారక్తదానం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిలు తమకు భరోసాగా ఉన్నారని వీరి సహకారంతోనే సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కాకాణి మంత్రిగా ఎల్లవేళలా ఉండాలని ఆయన సేవలు రాష్ట్రానికి, సర్వేపల్లి నియోజకవర్గానికి పొదలకూరు మండలానికి ఉండాలని అన్నారు. ఈకార్యక్రమంలో పొదలకూరు జడ్‌పిటిసి తెనాలి నిర్మలమ్మ, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు పి రమణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, సోమా భాస్కర్, మద్దిలేటి రమణారెడ్డి, ఎం సతీష్‌కుమార్‌రెడ్డి, ఎం శివశంకర్, ఎస్‌కె అంజాద్, ఖాదర్, ఎం రవి, వైకాపానాయకులు, కార్యకర్తలు, కాకాణి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పాత కక్షలతో వ్యక్తిపై దాడి



**సీతారామపురం నవంబర్ 10 ప్రభాతవార్త** మండలంలోని మారంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కలివెల బాలస్వామి అనే వ్యక్తిపై శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు బాధితులు కూలిపనులకు వెళ్ళి ఇంటికి వచ్చి రాత్రి ఇంటి ఆరు బయట నిద్రిస్తుండగా శుక్రవారం తెల్లవారు జామును గుర్తు తెలియని కత్తితో ముఖంపైదాడి చేయగా బాదితుడుకి కంటికి గాయమైందని తెలిపారు. 108 కి ద్వారా సీతారామపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసంకి ఉదయగిరి వైద్యశాలకు తరలించామని కుటుంబసభ్యులు తెలిపారు.

## అల్లూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

**అల్లూరు, నవంబరు 10 ప్రభాతవార్త** అల్లూరు సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకి అంతరాయం కలుగుతుందని మండలంలోని అన్ని పంచాయతీల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఎఇ షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయునికి ఘన సన్మానం



**మర్రిపాడు, నవంబర్10, ప్రభాతవార్త** :మండలంలోని రాజుపాళెం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేసి బదిలీపై వెళ్ళిన బత్తుల వెంకటేశ్వర్లును పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా కలిశెట్టి రాజేంద్రకుమార్ మాట్లాడుతూ వెంకటేశ్వర్లు నిబద్ధతతో అంకితభావంతో పనిచేసి పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశాన్నారు. అనంతరం శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు రత్నయ్య, విజయభాస్కర్‌రెడ్డి, సుబ్బయ్య, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, వెంకటసుబ్బయ్య, సుధాకర్, ఆశాకార్యకర్త ఉమారాణి, అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి, గ్రామస్తులు కృష్ణంరాజు, మదన్‌మోహన్, రాజజా తిరుపతిరాజు, శ్రీనివాసులు, యానాదయ్య, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ సభకు భారీగా తరలివెళ్లిన మాదిగలు



**ఉదయగిరి, నవంబర్10, ప్రభాతవార్త** ఉదయగిరి మండలం నుండి నవంబర్ 11వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప సభకు బస్సుల యాత్రగా బయలుదేరి వెళ్తున్న మాదిగలందరికీ ప్రత్యేక ఆహ్వానాలు పంపించి ప్రతి ఒక్కరినీ కదలి రావాల్సిందిగా కోరుతున్నట్లు ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు బకీర్ జాషువా, నియోజకవర్గ కో ఇన్‌చార్జ్ బెజవాడ బాల గురవయ్య కోరారు. ఈ సందర్భంగా బకీర్ జాషువా మాట్లాడుతూ 1994లో ఎమ్ ఆర్‌పిఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాటి నుండి మాదిగల రిజర్వేషన్ కొరకు, వర్గీకరణ కొరకు అలుపెరగని పోరాటం చేస్తూ ఎంతోమంది రాజకీయ ప్రముఖులను, విద్యావేత్తలను వర్గీకరణ విషయంలో ఒప్పించి పార్లమెంట్లో బిల్లు పెట్టే దిశగా యనలేని కృషి చేశారని తెలిపారు. ప్రత్యేకంగా ఈ సభకు ముఖ్యఅతిథిగా వస్తున్న భారత ప్రధాని నరేంద్రమోధీ సమక్షంలో మాదిగల వర్గీకరణ ఎంత అవసరమోవర్గీకరణ లేకపోవడంతో మాదిగ జాతి ఎంత నష్టపోయిందో దేశ ప్రధానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని, కాబట్టి ప్రతి కుటుంబం నుండి తరళి రావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. మాదిగ జాతి అభివృద్ధి కొరకు యనలేని కృషి చేస్తూ అలుపెరగని పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగకు ప్రధానమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఈ సభ నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా వారు కోరారు. ఉదయగిరి నియోజకవర్గంలో ప్రతి మాదిగ బిడ్డకు, మేధావులకు, విద్యావంతులకు ఖరపత్రాలు అందజేసి వర్గీకరణ ఆవశ్యకతను వివరించామని తెలిపారు. మాదిగలు, ఉప కులాలు భారీగా తరళివచ్చి సభను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

## సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన తహాశీల్దార్



**ఉదయగిరి, నవంబర్10, ప్రభాతవార్త** మండలకేంద్రమైన ఉదయగిరిలోని పలు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు ఉదయగిరి తహ శీల్దార్ సనా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా దుతూ మండలపరిధిలోని వెంగళ్ రావునగర్, గుడినెరవ, అప్పసముద్రం, ఉదయగిరి బిట్-3, సచివాలయాలను సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సచి వాలయ రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేసినట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది 100శాతం బయోమెట్రిక్ హాజరు ఉండాలని, డ్రస్ కోడ్ తప్ప నిసరిగా ఉండాలని తెలిపారు. సచివాలయాలకు సమస్యలతో వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పై అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు. గ్రామాలలో భూమి రీసర్వే, జగనన్న కాలనీలు, ఓటర్ రీవెరిఫికేషన్ జరుగుతున్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండి రికార్డులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట విఆర్‌వో బిల్లుపాటి వెంకటేశ్వర్లు, విఆర్ఎ శేషయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గంధ మహోత్సవంలో అన్నదానానికి విరాళం



**ఉదయగిరి, నవంబర్10, ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని శ్రీ మహబూబ్ సుభానీ గ్రంధ మహోత్సవ కార్యక్రమంలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమానికి విరాళం అందించినట్లు తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ బయ్యన్నయాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకునే ఈ కార్యక్రమానికి ఉదయగిరి మాజీ శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ నాయకులు బొల్లినేని రామారావు విరాళాన్ని అందించినట్లు వారు తెలిపారు. ఈ విరాళాన్ని బయ్యన్న చేతుల మీదుగా దర్గా కమిటీ సభ్యులైన ముర్తుజాకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మహబూబ్‌భాషా, బొజ్జా నరసింహులు, రాజా, వెంకటస్వామి, కాంతా రావు, వెంకటేశ్వర్లు, నాగయ్య, సందానీ, సురేష్, పిచ్చయ్య, శివకృష్ణ, దర్గా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు అండగా నిలుస్తున్న మేకపాటి




**దుత్తలూరు, నవంబర్ 10, ప్రభాతవార్త :** మండలంలోని నర్రవాడ గ్రామంలో గిరిజనులకు గూడు కల్పించడంతో పాటు, సకల సౌకర్యాలను కల్పించమే కాకుండా వారు వంట గ్యాస్ కు ఇబ్బందులు పడుతుండడంతో విషయం తెలుసుకున్న బిజెపి నేత మేకపాటి మాల్యాద్రి నాయుడు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడి ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన పథకం క్రింద తన స్వంత ఖర్చులతో 25 కుటుంబాల వారికి గ్యాస్ కనెక్షన్లు ఇప్పించారు. మూడు రోజుల పాటు ఆ గిరిజనులతో కలిసి గ్యాస్ కనెక్షన్ల కు అవసరమైన డ్యాంకుమెంట్లకు సైతం తనే ఖర్చు పెట్టి వారికి గ్యాస్ కనెక్షన్ల ను దగ్గరుండి మంజూరు చేయించారు. ఈ రోజుల్లో ఏ నాయకుడైన పేదలకు ఏ పని చేయాలన్నా తమకు ఎంత లాభమా అనే ఆలోచించే కాలంలో మేకపాటి మాల్యాద్రి నాయుడు లాంటి ప్రజా నాయకుడు మాకు అండగా ఉండడం దేవుడు ఇచ్చిన వరం అనీ కాలనీ వాసులు పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. ఈ నాయకుడిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకునీ, సేవలు చేస్తే భారతదేశం అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుందని పలువురు అభినందిస్తున్నారు.

## బాలికల హాస్టల్ లో కాకాణి జన్మదిన వేడుకలు



**మనుబోలు, నవంబర్ 10, ప్రభాతవార్త :** స్థానిక కోదండరామపురంలోని బాలికల సంక్షేమ హాస్టల్ లో శక్రవారం రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి వర్యులు కాకాని గోవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖ ర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేకు ను కట్ చేసి బాలికలకు పంచిపెట్టారు. అదే సమయంలో బాలికలకు దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాకాని గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నెంబర్ స్థానం లో తీర్చి దిద్దారనీ తెలిపారు. ఆయనే మాకు రోల్ మోడల్ అనీ, ఆయన ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు బాగా చదవాలనీ చంద్రశేఖర్‌రెడ్డి సూచిం చారు. ఈ కార్యక్రమములో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, వైకాపా మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగో పాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు చిట్టమూరు అజయ్‌కుమార్ రెడ్డి, ఎంపిటిసి దు వ్వూరు రాజేశ్వరి, నాయకులు ముంగర రవీందర్‌రెడ్డి, ఏడేం మల్లికార్జునరెడ్డి, సూరపనేని కిషోర్‌నా యుడు, దువ్వూరుసుధాకర్‌రెడ్డి, పార్దు గిరి తదితరులు పాల్గొన్నారు.

## బోరు కు మరమ్మత్తులు



**వింజమూరు, నవంబర్10, ప్రభాతవార్త :** వింజమూరు మండలం శంఖవరం పంచాయతీలోని వెంకటాద్రిపాళెం, శంఖవరం గ్రామాల్లో మరమ్మత్తులకు గురైన బోర్లుకు శుక్రవారం సర్పంచ్ భోగిరెడ్డి మల్లీశ్వరి వెంటనే స్పందించి మరమ్మత్తుకు గురైన బోర్లును బాగుచేయించారు. ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణపట్ల పంచాయతీ పరిధిలో తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించారు. పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి సురేష్, నాయకులు భోగిరెడ్డి వెంకటరమణారెడ్డి, సానా గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ముందస్తు దీపావళి సంబరాలు



**బుచ్చి నవంబర్ 10 ప్రభాతవార్త** విద్యార్దులకు సంస్కృతి సాంప్రదాయాలు తెలియజేయాలని దగదర్తి మండలం నారాయణపురం పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చీదరాల చెన్నయ్య విద్యార్దులకు ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆశ్వయుజ బహుళ అమావస్య రోజున దీపావళి జరుపుకుంటారని ఆయన తెలిపారు. పురాణకథలలో అనేక కథనాలు ఉన్నప్పటికి దీపావళి అంటే దీపాల వరుస అని అర్ధం అని ఈ పండుగను 5 రోజులు జరుపుకుంటారని చెప్పారు. ఆశ్వయుజ బహుళ త్రయోదశతో ప్రారంభమై కార్తీక శుద్ధ విదియ " భగినిహస్తబోజనంతో " ముగుస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో పేరెంట్స్ కమీటి సభ్యులు యువకులు, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు. పూలతో అలంకరించిన రంగవల్లులపై ప్రమీదలతో దీపాలు వెలిగించి కాకరపూలతో ఆహ్లాదంగా పండుగను జరుపుకున్నారు. విద్యార్దులు లక్ష్మీదేవి రూపాలతో అలంకరించి ఆహుతులకు ప్రమిదలు, కాకరపూలు కోవ్వుత్తులు, మిఠాయిలు పంచిపెట్టారు.

## ఓబిసి మోర్చ జిల్లా కార్యదర్శిగా సోమ లక్ష్మయ్య



**బుచ్చి నవంబర్ 10 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంకి చెందిన సోమ లక్ష్మ య్యను ఓబిసి మోర్చ జిల్లా కార్యదర్శిగా ఓబిసి మోర్చ జిల్లా అద్యక్షులు యాకసిరి పణిరాజు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనను బుచ్చిరెడ్డి పాళెం బిజెపి టౌన్ అద్యక్షులు రామిశెట్టి కళ్యాణ్, బిజెపి జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, కిసాన్‌మోర్చ అద్యక్షులు చేవూరు వినయ్‌నా రాయ ణ శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

## 13న సెలవు కారణంగా జగనన్నకు చెబుదాం రద్దు

**బిట్రగుంట, నవంబరు 10 ప్రభాతవార్త** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 13వ తేదిన అధికారికంగా సెలవు ప్రకటించడంతో జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం రద్దు చేసినట్లు ఎంపిడివో అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు తెలిపారు.

## మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించండి



**సంగం నవంబర్ 10 ప్రభాతవార్త** సంగం సచివాలయం -2 పరిధిలో వైసిపినాయకులు, అధికారులు వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సంక్షేమపథకాల బోర్డులను సర్పంచ్ రమణమ్మ, జడ్‌పిటిసి రావూల లక్ష్మీ, అధికారులు వైసిపినాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం మెయిన్ రోడ్డులో వైసిపి జెండాను ఆవిష్కరించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యావైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. రాబోయే ఎన్నికలలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆత్మ కూరులో ఎమ్మేల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని ఆదరించాలని కోరారు. ఈకార్య క్రమంలో జడ్‌పిటిసి రావుల లక్ష్మీ,. ఎంపిడిఓ గోపి, వైసిపి మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, వైసిపినాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, కంఠా బత్తిన రఘునాదరెడ్డి, ఇఒపిఆర్‌డి రమేష్, పంచాయితీ కార్యదర్శులు శ్రీకాంత్, కిషోర్, వైసిపినాయకులు పెరుమాళ్ళ రవీంద్రబాబు, రామారావు, జనార్దన్‌రెడ్డి, రమేష్ , జహంగీర్, శివ తదితరులు పాల్గొన్నారు.

## బాణాసంచా విక్రయదారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి

**బిట్రగుంట, నవంబరు 10 ప్రభాతవార్త** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని బోగోలులో బాణాసంచా విక్రయించే విక్రయదారులు ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు విక్రయాలు సాగించాలని బిట్రగుంట ఎస్ఐ శేఖర్‌బాబు హెచ్చరించారు. నిబంధనలకు వ్యతిరేకంగా విక్రయాలు జరిగినా, బాణాసంచా అక్రమంగా గోడౌన్లలో నిల్వ వుంచినా చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.

## సచివాలయాలు ఆకస్మిక తనీఖీ చేసిన తహసిల్దారు



**సంగం నవంబర్ 10 ప్రభాతవార్త** సంగం మండలంలోని కొరిమెర్ల, తరుణవాయి సచివాలయాలను తహసిల్దారు నాగరాజు ఆకసి క్మక తనీఖి నిర్వహించారు. సందర ్బంగా సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆయన ఆరా తీశారు. బయోమెట్రిక్ తప్పనిసరి అని, డ్రస్ కోడ్ తప్ప పాటించాలని చెప్పారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట సచివాలయ సిబ్బంది, వాలింటర్లు ఉన్నారు.

## వెంగాయగారిపాళెంలో ఉచిత ఆయుర్వేద ఉచిత వైద్యశిబిరం




**కావలి రూరల్, నవంబరు 10 ప్రభాతవార్త** కావలి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో కావలి వెంగాయగారిపాళెం సచివాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్ సహకారంతో 8వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ హలీ మౌలాలి, డాక్టర్ రాజేంద్రసింహం, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ విజయకుమారి, డాక్టర్ రోహిణిలు పాల్గొని రోగులను పరీక్షించి సూచనలు, సలహాలు అందజేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్లను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుబ్బారెడ్డి, పవన్, విద్యాలత, రోటరీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్షల్లో విజేతలకు బహుమతులు ప్రధానం



**కావలి రూరల్, నవంబరు 10 ప్రభాతవార్త** కావలిలోని విశ్వశాంతి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో ది రత్నమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు యం.వి.ప్రసాదరావు ఆధ్వర్యంలో వారి సతీమణి, విశ్రాంత ప్రధా నోపాధ్యాయిని బి.వి.రత్నమ్మ పేరు మీద ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్షలలోని విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా కావలి పట్టణ, మండల విద్యాశాఖాధికారులు సి.హెచ్.వెంకట సుబ్బయ్య, బి.గోవిందయ్యలు పాల్గొని మాట్లాడారు. ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షలు నిర్వహించడం వల్ల పిల్లల్లోని సృజనాత్మక శక్తిని వెలికి తీయడం, సమయస్ఫూర్తిని, జ్ఞాపక శక్తిని అభివృద్ధి పరచడం, ఓఎంఆర్ షీట్‌ను సరైన పద్దతిలో నిర్ణీత కాలంలో భర్తీ చేయడం, సరైన జవాబులు విద్యార్థులు రాయడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్రాంత వసతిగృహ సంక్షేమాధికారి ఎస్.కె.బాషా మాట్లాడుతూ విజేతలకు మెమోంటోలు, ప్రశంసా పత్రాలు, గిఫ్ట్ బాక్సులు అందజేసి విద్యార్థులను ప్రోత్సహించేందుకు బి.వి.రత్నమ్మ పేరు మీద బహుమతులు అందజేస్తు న్నారన్నారు. అనంతరం ఆంధ్రకేసరి పాఠశాల విద్యార్థులు కె.గౌతమ్‌సాయి, జి.ధీరజ్‌కుమార్, టి.వి.జి.వర్షిత, జలదంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని టి.కావ్యలు ఉన్నత ర్యాంకులు సాధించడంతో వారికి బహుమతులు అందజేశారు. ప్రోత్సాహక బహుమతులు 30 మందికి అందజేశారు. విశ్వశాంతి పాఠశాల కరస్పాండెంట్ డి.వి.రమణయ్య, హరినాథ్, గంగాధర్, రమేష్, లక్ష్మయ్య, బాలిరెడ్డి, సుబ్బయ్యలు పాల్గొని విజేతలను అభినందించారు.

## ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు



**వరికుంటపాడు, నవంబర్ 10, ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించిని ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కే దక్కుతుందనీ ఎఎంసి మాజీ చైర్మన్ షేక్ అలీ అహ్మద్, మండల పార్టీ కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు, జెసిఎస్ కన్వీనర్ బొడ్డు వెంకటేశ్వర్లు రెడ్డి లు అన్నారు .ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమములో భాగంగా వరికుంటపాడు గ్రామ పంచాయతీ లో వైకాపా యువజన నాయకుడు పోలుబోయిన మల్లికార్జున ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగిసంక్షేమ పథకాలకు సంబందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి వైకాపా కే పట్టం కట్టాలనీ కోరారు. ఈ కార్యక్రమములో వరికుంటపాడు సర్పంచ్ కొండెపోగు దిలీప్ కుమార్, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాగంటి శ్రీనివాసులు, నేతలు రేగలగడ్డ బంగారుబాబు, బొల్లా మురళి, భాస్కర్ రెడ్డి, చిందే నవీన్, ప్రభాకర్ రెడ్డి, పోలిబోయిన హజరత్ బాబు, పోలుబోయిన పెద్ద మాలకొండయ్య, నల్లగొర్ల మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## రాపూరు బిట్ 3లో వై ఎపి నీడ్స్ జగన్




**రాపూరు, నవంబరు10ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరు బిట్ 3 సచివాలయంలో వై ఎపి నీడ్స్ జగన్ కారక్రమాన్ని వైసిపి మండలకన్వినర్ పాపకన్ను దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో వివిధపథకాలకు సంబందించి పంపిణీ చేసిన మొత్తం, లబ్దీదారులు ఎంత మంది తదితర విషయాలను డిస్ప్లే బోర్డుద్వారా తెలియపరిచారు. అనంతరం సచివాలయం వద్ద వైసిపి పార్టీ జెండాను అవిష్కరించారు. రాత్రి సచివాలయంవద్ద వైసిపి ముఖ్యనేతలు డిన్నర్ కార్యక్రమంలో పాల్గోన్నారు. జెసిఎస్ కన్వినర్ దందోలు నారాయణరెడ్డి, సర్పంచ్ భూపతి జయమ్మ, నాయకులు పెంచలకోన దేవస్థానం మాజీ చైర్మన్ నెల్లూరు రవీంద్రా రెడ్డి, ఎస్. శశిధర్ రెడ్డి, వైస్ యంపీపీ పి.పెంచల రెడ్డి, పలువురు యంపీటీసీలు, పలువురు గ్రామ సర్పంచ్‌లు, వైసిపి నాయకులు పాల్గోన్నారు.

## అయ్యప్ప స్వామి వారి ఆలయానికి అరకిలో వెండి బహుకరణ



**రాపూరు, నవంబరు10ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరుకు సమీపంలోని మద్దెలమడుగు వాగు వద్ద వున్న శ్రీశ్రీశ్రీ మహావిష్ణువు, శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలోని అయ్యప్ప స్వామికి గురువారం రాత్రి రాపూరుకు చెందిన మెంటా వెంకటరత్నం(బాబు)అర కిలో వెండి బహుకరించారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులు ముందుగా శ్రీ మహావిష్ణువు, శ్రీ అయ్యప్పస్వామి వారి ఆలయాలలో పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి వారికి కిరిటం చేయించే నిమిత్తంఅరకిలో వెండిని ఆలయ కమిటీ సభ్యులకు ఆందజేశారు. స్వామి వారి ఆలయానికి వెండి ఆందజేసిన దాతలకుకమిటీ వారు స్వామి వారి కండువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల14వ తేది మంగళవారం నుండి కార్తీకమాసం సందర్భంగా 41 రోజుల పాటు రెండు పూటల మద్యాహ్నం, రాత్రి స్వాములకు బిక్ష(అన్నదానం)నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులతో పాటు స్వామి వారి అన్నదానానికి దాతలు విరాళాలు ఆందజేసి స్వామి వారి కృఫకు పాత్రులు కావాలని కోరారు.

## ఏపికి జగన్ వద్దంటూ జనసేన ప్రచారం

**రాపూరు, నవంబరు10ప్రభాతవార్త** రాష్టానికి ముఖ్యమంత్రిగా జగన్ వద్దు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కావాలంటూ శుక్రవారం జనసేన వెంకటగిరినియోజకవర్గం నాయకుడు గూడూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రాపూరులో పోస్టర్‌లు అవిష్కరించి నినాదాలుచేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్టాన్ని అన్ని విదాలా భ్రష్టుపట్టించినసియం జగన్ ఇక రాష్టానికి వద్దు అని, తెలుగుదేశం, జనసేన నాయకులైన నారా చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్‌లే రాష్టానికి కావాలని వారు అధికారంలోకి వస్తేనే రాష్టం తిరిగి అభివృద్ధి భాటలో నడుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగిశెట్టి విజయ్ కుమార్, పలువురు జనసేన నాయకులు వున్నారు.

## ప్రజా ప్రభుత్వాన్ని ఆదరించండి



**వరికుంటపాడు, నవంబర్ 10, ప్రభాతవార్త :** రాష్టంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, ప్రతి గ్రామంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసిన వైకాపా ప్రభుత్వాన్ని ఆదరించాలనీ మండల పార్టీ కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు, మాజీ ఎఎంసి చైర్మన్ షేక్ అలీ అహ్మద్, ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మమ్మ, సోసైటి అధ్యక్షుడు గుంటుపల్లి రామాంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని రామాపురం గ్రామ సచివాలయంలో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ వద్ద ఏర్పాటు చేసిన సభలో మాజీ ఎఎంసి చైర్మన్ అలీ అహ్మద్ మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి మడమ తిప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గా నిలిచారనీ కొనియాడారు. ఎవరి ప్రమేయం లేకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు నేరుగా గడప వద్దకే అందిస్తున్నారన్నారు. అనంతరం సచివాలయ పరిధిలోని హుస్సేన్ నగర్‌లో పార్టీజెండాను ఆవిష్క రించారు. ఈ కార్యక్రమములో ఎంపిడిఓ చేవూరి శ్రీదేవి, మండల జెసిఎస్ కన్వీనర్ బొడ్డు వెంకటేశ్వర్లు రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాగంటి శ్రీనివాసులు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలానీ భాష, స్థానిక నేతలు దారపనేని చెన్నారాయుడు, రాయవరపు మధుసూధన్ రావు, దుగ్గినేని విజయలక్ష్మి మాజీ సర్పంచ్ మేడసాని చెన్నకేశవులు, సర్పంచ్‌లు కొండెపోగు దిలీప్ కుమార్, యర్రమల ప్రభాకర్ మహిళానాయకురాలు బత్తిన కొండమ్మ, ఈఓఆర్డి సికిందర్ , పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్ వాలంటీర్లు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్‌డీటీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, నవంబరు10ప్రభాతవార్త :** ప్రస్తుత ఆధునిక సమాజంలో సివిల్ ఇంజనీరింగ్ చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనాలను పాడు చేయకుండా ఎస్‌డీటీ పద్ధతి ద్వారా వాడి నిర్మాణాల యొక్క నాణ్యతను, శక్తిని సులువుగా కనుక్కొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎస్‌డీటీ పద్ధతిని ఏ విధంగా పరీక్షించాలి.. వాటి సామర్థ్యత వివరాలపై ప్రొఫెసర్ పి. రామ్మోహన్‌రావు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి పి. సాయి కృష్ణ పలు సూచనలు చేశారు. సివిల్ ఇంజనీరింగ్ అధ్యాపకులు ప్రొఫెసర్ పి. రామ్మోహన్‌రావుకు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉన్నారు.

## ఎరువులకు గడువు తేది లేదు




**కోవూరు, నవంబరు10ప్రభాతవార్త :** వ్యవసాయం సాగు చేసే రైతులు ఎరువుల విషయంలో ఎటువంటి అపోహలు పడవద్దని, అసలు ఎరువులకు గడువు తేదీ అనేది లేదని మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి తెలిపారు. కోవూరులోని రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతుభరోసా కేంద్రంలో డీఏపీ, యూరియా మొదలైన ఎరువులను స్టాక్‌గా ఉంచడం జరిగిందన్నారు. ఐదు సంవత్సరాల వరకు ఎరువుల్లోని పోషకాలు నిరభ్యంతరంగా వాడుకోవచ్చన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత తెలిపారు. కాలువ కింద సాగు చేసే వారు ప్రస్తుత సీజన్‌లో పెసలు, నువ్వులు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మెహర్నిసా, చాద్విక, వంశీ, రాజశేఖర్, అశోక్, రైతులు ఉన్నారు.

## ఘనంగా మంత్రి కాకాణీ జన్మదిన వేడుకలు



**వెంకటాచలం, నవంబరు10ప్రభాతవార్త** వెంకటాచలం మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలలో రాష్ట వ్యసాయ శాఖ మంత్రి కాకాణీ గోవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా శుక్రవారం నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాలునిర్వహించారు. వెంకటాచలంలో జిల్లా వైసిపి ఉపాధ్యక్షుడు మండల వెంకటశేషయ్య ఆధ్వర్యంలో ఇందిరమ్మకాలనీ వద్ద పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎర్రగుంట వద్ద వున్న విద్యార్థులకు విద్యా సామాగ్రిని ఆందజేశారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ సమీపంలో వున్న మానసిక వికలాంగుల కేంద్రంలో వికలాంగ విద్యార్థులకు అన్నదానంఏర్పాటు చేసి పండ్లు, స్వీట్లు ఆందజేశారు. అనంతరం శేషయ్య మట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గాన్ని ఎన్నడూలేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన ఘనత మంత్రి కాకాణీకే దక్కిందన్నారు. నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం తపిస్తూ పేదల అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడు కాకాణీ గోవర్ధన్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో చేసుకోవాలని అకాంక్షించారు. మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## ఓబీసీ మోర్చా కార్యవర్గం నియామకం



నెల్లూరు నవంబర్ 10, ప్రభాతవార్త-వైద్యం భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా బృంగి మల్లేశ్వరరావు, నాటకరాణి జయచంద్ర, తిరకాల శివ, మహిమలూరి శ్రీనివాసులు, రాపూరు ప్రసాద్, గొల్లపోలు రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా లింగాల రామకృష్ణ, కార్యదర్శులుగా సోమ లక్ష్మయ్య, గుంజి కృష్ణ, అన్నం విజయకుమార్, మహిమలూరి సతీష్‌కుమార్, నున్నగుంట గోవింద్‌రెడ్డిలు, కోశాధికారిగా ఇనుకోట మధు, లీగల్‌సెల్ కన్వీనర్‌గా రేలంగి నీలకంఠ ప్రసాద్, సోషల్‌మీడియా కన్వీనర్‌గా చింతపూడి రాజశేఖర్, ఆర్‌టిఐ కన్వీనర్‌గా కీలుకుప్ప శ్రీనివాసులును, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ధోనిపర్తి శ్రీనివాస్, అంబటి జనార్ధన్, మాచవరం రాఘవయ్య, ప్రళయకావేరి ప్రభాకర్, తిరకాల వేణుగోపాల్, దాసరి అనిల్‌కుమార్, గుమ్మడి కిరణ్‌కుమార్, గట్టిబోయిన దుర్గయ్య, అద్దంకి రాజశేఖర్, పులి రమేష్, గుంజి రాజేష్, బొమ్మబత్తిన వెంకటేష్‌లను నియమించినట్లు బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాకసిరి ఫణిరాజు తెలిపారు. శుక్రవారం నగరంలోని రామ్మూర్తినగర్‌లో ఉన్న బీజేపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితులు కర్నాటి ఆంజనేయరెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగరాల సురేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుడుమలు గిరికుమార్‌గౌడ్. జోనల్ ఇన్‌చార్జ్ ముక్కు రాధాకృష్ణగౌడ్, తిరుపతి ఇన్‌చార్జ్ సుధీర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హౌసింగ్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డిఇ



**సంగం నవంబర్ 10 ప్రభాతవార్త** సంగంలోని హౌసింగ్ కార్యాలయాన్ని హౌసింగ్ డిఇ శ్రీహరిగోపాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి గృహనిర్మాణాల పనితీరు గురించి కరిముల్లాను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆత్మకూరు నియోజకవర్గంలో మంజూరైన 8844 గృహలలో అన్ని వివిధ దశలో ఉన్నాయని తెలిపారు. వర్షాల వల్ల కొంచెం ఆలస్యం అయిందని వర్షాలు తగ్గిన వెంటనే నిర్మాణాలు వేగవంతం చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విధంగా డిసెంబర్ నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కున్నారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట హౌసింగ్ సిబ్బంది ఉన్నారు.

## ఓగూరులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం




కందుకూరు, నవంబర్10, ప్రభాతవార్త మండలపరిధిలోని ఓగూరు గ్రామ సచివాలయ పరిధిలో మా నమ్మకం నువ్వే జగనన్న ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరై గృహసారధులు, వాలంటీర్లకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓగూరు గ్రామ సచివాలయ పరిధిలో సీఎం జగనన్న ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు ఎంత లబ్ధి పొందారో వారికి తెలియజేసేలా సంక్షేమ పథకం బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా సీఎం ప్రవేశపెట్టిన నవరత్నాలలో భాగంగా ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ రూ.16,40,21,379లబ్ధి అలాగే పరోక్ష ప్రయోజనాల బదిలీ రూ.3,91,36,553 లబ్ధిని పొందారనిమొత్తం రూ.20,13,57,932 లబ్ధి చేకూర్చే విధంగా మన ప్రభుత్వ పాలన సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు గంగవరపు వెంకటరావు, కందుకూరు మండల జెసిఎస్ కోఆర్డినేటర్ చీమల వెంకట రాజా, కందుకూరు ఎంపీపీ ఇంటూరి సునీత, మండల జడ్పీటిసి తొట్టెంపూడి అనసూర్యమ్మ, కోవూరు సర్పంచ్ ఆవుల మాధవరావు, కొండికందుకూరు సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య, పార్టీ నాయకులు తొట్టెంపూడి శ్రీనివాసరావు, ఇంటూరి మాదశరావు, రమేష్‌బాబు, కన్వీనర్లు చల్లా శ్రీనివాసరావు, శ్రీని వాసరెడ్డి, కోటయ్య, మాచర్లయ్య, రాదయ్య, గృహసారధులు, వాలంటీర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రాష్టంలో దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి



**కోవూరు, నవంబరు10ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు మండలం వేగూరు గ్రామంలో శుక్రవారం 1.30 కోట్ల నిధులతో నిర్మాస్తున్న కైలాసనాథ స్వామి దేవాలయ నిర్మాణ పనులకు సాంప్రదాయబద్ధంగా శంకుస్థాపన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా 38 దేవాలయాల నిర్మాణాలకు 3.80 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా వేగూరులో నిర్మిస్తున్న కైలాసనాథ స్వామి దేవస్థానానికి ముఖ్యమంత్రి 86.38 లక్షల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ పురాతన దేవాలయానికి 400 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని, అటువంటి దేవాలయ శంకుస్థాపనకు పాల్గొనడం తమ అదృష్టింగా భావిస్తున్నామన్నారు. దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజే స్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ సభ్యులుగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పోటీ చేస్తున్నారని, అటువంటి మంచి మనస్సు ఉన్న వ్యక్తిని ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇప్పటికే వేగూరు గ్రామాన్ని వేమిరెడ్డి దత్తత తీసుకుని ఇప్పటికే 70 లక్షల మేర నిధులు అభివృద్ధి కార్యక్రమాలకు అందజేయడం జరిగిందన్నారు. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి పురాతన దేవాలయ శంకుస్థాపనలో పాల్గొనడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృదినథ పథంలో పయనింపజేస్తూ భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రజల వద్దకే పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డినే అన్నారు. ఎంతసేపటికి ఆయన ధ్యాసంతా రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ఉండాలన్నదే ముఖ్యమంత్రి ఆశయమన్నారు. ఇప్పటికే భారతదేశంలోని పలు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారన్నారు. అంతకుముందు ఊరి పొలిమేర నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య ఎంపీ, ఎమ్మెల్యేలను గ్రామ ప్రజలు, పురప్రముఖులు, నేతలు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కె. రంగారెడ్డి, నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, సీసీఎస్ క్యాటరింగ్ అధినేత చంద్రశేఖర్. సొసైటీ డైరెక్టర్ జనార్ధన్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి కృష్ణప్రసాద్ ఉన్నారు. ఇనమడుగు సర్పంచ్ ప్రమీలమ్మ, నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ అధినేత వసంత్‌కుమార్‌రెడ్డి, స్తపతి సురేంద్ర, అమర్, నేతలు మహేష్, కె.ప్రసాద్, చిరంజీవి, నరసింహ, తదితరులు ఉన్నారు.

## 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాల



**కోవూరు, నవంబరు 10 ప్రభాతవార్త :** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్న బీఎల్‌వోలు దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని నుడా వైస్ చైర్మన్ , కోవూరు ఎన్నికల అధికారి బాపిరెడ్డి అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి కోవూరు మండలాలకు సంబంధించిన తహసీల్దార్లు పోలింగ్ బూత్ సూపర్‌వైజర్ల బీఎల్‌ఎల్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా 10 మందికి మించి ఒకే డోర్ నెంబర్ ఓటర్లు నమోదు అయి ఉంటే అటువంటి వారిని మరోసారి నిశితంగా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా ఎటువంటి డోర్ నెంబర్ లేకుండా జీరో డోర్‌తో ఉన్న ఓటర్ల వివరాలు కూడా మరోసారి పరిశీలించాల్సి ఉంటుందన్నారు. కోవూరు నియోజకవర్గానికి సంబందించి ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయడం జరిగిందని, దీనికి సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రం ప్రాంతంలో ఏర్పాటు చేయడం జరిగిందని, ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత బీఎల్‌వోకు ఇవ్వాల అనంతరం బూత్ లెవల్ సూపర్‌వైజర్ల పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో తహసీల్దార్లు ఎం. పద్మజ, పోలింగ్ బూత్ సూపర్‌వైజర్లు బీఎల్‌ఎలు ఉన్నారు.

## ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దాలనేదే నాలక్ష్యం



**నెల్లూరు నవంబర్ 10, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా, ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో ఆ లక్ష్యంతోనే నగరానికి భూగర్భ డ్రైనేజీని నిర్మించామని తెలుగుదేశం పార్టీ మాజీమంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 15వ డివిజనులో నారాయణ బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ నిర్మాణంతో దోమల బారినపడి అనారోగ్యం పాలు కాకుండా, నగరవాసులు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతారనే ఆలోచనతో నిర్మించిన దానిని, వైసీపీ పట్టించుకోక పోవడంతో ఆ డ్రైనేజీ వాడకంలో లేకుండాపోయిందని బాధపడ్డారు. సంగం నుంచి నగరానికి శాశ్వత తాగునీటి పథకం కింద ప్రత్యేక పైప్‌లైన్ నిర్మించామన్నారు. రాష్టంలో ఎక్కడ కూడా అభివృద్ధి జరగకుండా ఉండాలనే ఆలోచనతో వైసీపీ ప్రభుత్వం, టీడీపీ నాయకులను అక్రమ అరెస్టులు చేయిస్తూ, జైళ్ళకు పంపిస్తుందన్నారు. పరిపాలన ఇలాగే సాగితే ఈ రాష్టం మరో శ్రీలంక అయిపోతుందని నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. మొదట ఆయనకు ఆ డివిజను నాయకులు శాలువాలు కప్పి, పూలబొక్కేలను అందచేసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు దొడ్డపనేని రాజానాయుడు, షేక్ కరిముల్లా, డివిజను అధ్యక్షుడు కమ్మ పెంచలచౌదరి, అంచూరు శ్రీనివాసులునాయుడు, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

**కావలి, నవంబరు 10 ప్రభాతవార్త** కావలి ముసునూరులో నిర్మించిన జగనన్న ఇళ్లు చిరుజల్లులకే కూలిపోతుంటే పేదల జీవితాలతో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెలగాటమాడడం ఏమిటని టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు హెచ్చరికలు చేశారు. నాసిరకం నిర్మాణాలపై, అవినీతిపై వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో కార్యాలయ ఆవరణలో వున్న గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాన్ని శుక్రవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ముట్టడించారు. ఈ సందర్భంగా మాలేపాటి మాట్లాడారు. తాము వస్తున్నామన్న విషయం తెలుసుకుని గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు పత్తాలేకుండా పోయారని విమర్శించారు. ముసునూరు జగనన్న ఇళ్లు నాసిరకంగా నిర్మాణాలు చేపట్టారన్నారు. పేదల ప్రాణాలతో చెలగాటమాడితే ఎలా అని ప్రశ్నించారు. ఈ నాసిరకం అవినీతి నిర్మాణాలపై వెంటనే ఉన్నతాధికారులు విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవైపు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలను ఉద్దరిస్తున్నామని చెబుతూ పేదలు నివసించే ఇళ్లు కూలిపోయే విధంగా నిర్మించడం వైసిపి మోసపు మాటలకు నిదర్శనమన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఈ నాసిరకం నిర్మాణాలపై, అవినీతిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ముట్టడి కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, టిడిపి నేతలు గుత్తికొండ కిషోర్‌బాబు, జ్యోతిబాబురావు, మొగిలి కల్లయ్య, ఏగూరు చంద్రశేఖర్, గొట్టిపాటి రాము, దేవకుమార్ మాదిగ, పోతుగంటి శ్రీకాంత్, బొట్లగుంట శ్రీహరినాయుడు, తదితరులు మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యాన్ని తూలనాడారు. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు గైకొనాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. అధికారులు రాకపోవడంతో కార్యాలయ ఆవరణలో మాలేపాటి ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు.

## పేకమేడల్లా కూలిపోతున్న జగనన్న ఇళ్లు !



**కావలి, నవంబరు 10 ప్రభాతవార్త** కావలి పట్టణంలో రెండు రోజుల క్రితం కురిసిన చిరుజల్లులకే జగనన్న ఇళ్లు పేక మేడల్లా కూలిపోతున్నాయని టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బా నాయుడు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జగనన్న ఇళ్ళ నిర్మాణంలో జరుగుతున్న అంతులేని అవినీతిపై వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కావలి మున్సిపాల్టీ పరిధిలోని ముసునూరు జగనన్న మెగా లేఅవుట్‌ని మాలేపాటి నాయకత్వంలో శుక్రవారం టిడిపి నేతలు, కార్యకర్తలు సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో మాలేపాటి సుబ్బానాయుడు, టిడిపి కావలి నియోజకవర్గ పరిశీలకులు బొమ్మి సురేంద్రలు మాట్లాడారు. ఇళ్ళ నిర్మాణ నాణ్యతను చూసి అవాక్కయ్యా మ న్నారు. ఇది జగనన్న ఇళ్లు కాదని పిచ్చుక గూళ్లు అని దుయ్యబట్టారు. చిరు జల్లులకే ఈ ఇళ్లు కూలిపో తుంటే పేదల ప్రాణాలకు రక్షణ ఏదన్నారు. నాసిరకం రాయి, కల్తీ ఇసుక, నాసిరకం సిమెంటు వాడడంతో ఇళ్ల నిర్మాణాలు చేసినట్లు తెలుస్తుందన్నారు. ఇంత నాసిరకంగా నిర్మాణం చేస్తున్న ఈ ఇళ్ళను పేదలకు ఎలా ఇస్తారన్నారు. చిరుజల్లులకే కూలిపోతుంటే ఒక మాదిరి గాలివానకు మొత్తం ఇళ్లు నేలమట్టమవుతాయన్నారు. ఈ నాసిరకం ఇళ్లలో నివసించే పేదలకు ప్రాణాలు దక్కుతాయా అని ఆందోళన వ్యక్తం చేశారు. పిచ్చుక గూళ్లు, కాకుల గూళ్లు గట్టిగా వుంటాయని ఈ జగనన్న ఇళ్లు మాత్రం అన్యాయంగా వున్నాయన్నారు. ఇల్లు కాదు ఊర్లు నిర్మిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పేదలకు మృత్యు గృహాలను నిర్మిస్తున్నారని ధ్వజమెత్తారు. పేదలకు ఇళ్లు నిర్మిస్తున్నామన్న పేరుతో అంతులేని అవినీతికి తెర దీశారన్నారు. డబ్బును ఎలా దోచుకోవాలో ఈ ఇళ్ల నిర్మాణం చూస్తే అర్ధమవుతుందన్నారు. జగనన్న ఇళ్ల లబ్ధి దారులు తక్షణమే తమ ఇళ్లను పరిశీలించి నాణ్యతపై ఎమ్మెల్యేని నిలదీయాలని పిలుపునిచ్చారు. కూలి పోతున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలు, నాణ్యతా ప్రమాణాలు, అవినీతిపై ఈ లేఅవుట్ పేరుతో జరిగిన అక్రమ గ్రావెల్‌పై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతు గంటి అలేఖ్య, టిడిపి నేతలు గుత్తికొండ కిషోర్‌బాబు, జ్యోతిబాబురావు, ఏగూరి చంద్రశేఖర్, బొట్లగుంట శ్రీహరినాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. సియం డౌన్‌డౌన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

## దేవరదిబ్బ గిరిజన కాలనీలో దుప్పట్ల పంపిణీ

**ముత్తుకూరు, నవంబర్10, ప్రభాతవార్త** మండలంలోని పైనాపురం పంచాయతీలోని దేవరదిబ్బ గిరిజన కాలనీలో స్థానిక సర్పంచ్ విజయకుమార్ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరై దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే సర్పంచ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయ్ మాట్లాడుతూ మంత్రఇ కాకాణి గోవర్ధన్‌రెడ్డి పైనాపురం అభివృద్ధికి కృషి చేశారని, పంచాతీకి సంబంధించి ఎవైనా అడిగిన వెంటనే ఆ పంచాయతీకి కావాల్సిన నిధులు సమకూర్చారని ఆయన అన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడిని వేడుకున్నారు. డోర్ టు డోర్ దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల వారిని అభివృద్దిలోకి తెచ్చిన ఘనత జగన్‌ది



**కలువాయి నవంబర్ 10 ప్రభాతవార్త** రాష్ట్రంలో బడుగు, బలహీన అన్ని వర్గాల వారిని అభివృద్ధిలోకి తెచ్చి సామాజిక సాధికారత సాధించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలువాయి జడ్‌పిటిసి బులగాకుల అనీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సచివాలయం -2 పరిదిలో ఆంధ్రప్రదేశ్‌కి మళ్లి జగనన్న ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు జడ్‌పిటిసి అనీల్‌కుమార్‌రెడ్డి ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలోని వాలంటరీలు, సచివాలయ సిబ్బంది గృహసారదులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. వైసిపి కన్వీనర్ మాకిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, జడ్‌పిటిసి అనీల్‌కుమార్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ మాదాస్ యజ్ఞపవన్‌లు వాలంటరీలకు సంక్షేమపధకాల కరపత్రాలు అందజేశారు. అనంతరం జడ్‌పిటిసి అనీల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతు 2024లో జరగనున్న ఎన్నికలలో నిబద్దతగల నాయకుడికే పట్టం కట్టాలని ఆయన కోరారు. గత ప్రభుత్వం హయాంలో పాలన విధానానికి ప్రస్తుత పాలన విధానానికి ఎన్నో కీలక మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు. బూటకపు మాటలతో ప్రజల్ని మభ్య పెట్టిన ప్రభుత్వం గత పాలకులదైతే నిబ్బదతో ఇచ్చిన మాటకు కట్టుబడిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అనంతరం సచివాలయ పరిధిలోని జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించి సంక్షేమపధకాల దా ్వరా లబ్దిదారులు పొందిన వివరాలను వారికి తెలియజేసి కరపత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపిపి ఆర్ లక్ష్మీదేవి పిఎసిఎస్ అద్యక్షులు చల్లా సుబ్బరామిరెడ్డి సర్పంచ్ పెంచలమ్మ, ఎంపిటిసి విజయమ్మ, కో ఆప్షన్ మెంబర్ షేక్ రఫీ అహ్మద్ సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బస్సు యాత్రల పేరుతో ప్రజలకు నరకం చూపించిన ఎమ్మెల్యే




**కావలి, నవంబరు 10 ప్రభాతవార్త** కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అభివృద్ధి నిరోధకుడని దోచుకోవడం, దాచుకోవడం తప్ప ఆయనకు ఇంకేమి తెలియదని బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. ప్రతాప్‌కుమార్‌రెడ్డిని మరలా గెలిపిస్తే ప్రజల ఆస్తులను కూడా దోచుకుంటాడని దుయ్యబట్టారు. సామాజిక సాధికార బస్సు యాత్ర పేరుతో కావలి ప్రజలకు నరకం చూపించారని ఆయన మండిపడ్డారు. కావలి పట్టణ రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సామాజిక సాధికారత బస్సు యాత్ర పేరుతో కావలి పట్టణ జాతీయ రహదారిపై నడిబొడ్డులో రోడ్లన్ని బ్లాక్ చేసి ప్రజల రాకపోకల్ని అడ్డగించారన్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఓవర్ బ్రిడ్జి సెంటర్ నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు జాతీయ రహదారిని బ్లాక్ చేశారన్నారు. వీధుల్ని ఫ్లెక్సీలతో ముంచెత్తి ట్రాఫిక్‌ను స్తంభింపజేశారన్నారు. దీనికి కారకులైన పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వైసిపి అగ్రనేతలైన విజయ్‌సాయిరెడ్డి నుంచి అప్పలరాజు కప్పలరాజు వరకు ఉపన్యాసాలు చెప్పారే తప్ప కావలి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని చెప్పలేకపోయారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం పోర్టులను వైసిపి నేతలు తమవిగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రామాయపట్నం పోర్టు, ఫిషింగ్ హార్బర్, అమృత పథకం అన్ని కేంద్రం నిధులతో ఏర్పాటు చేసినవేనన్నారు. కావలిలో రోడ్లు అన్ని గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందికరంగా మారితే అభివృద్ధి చేయలేని దుస్థితిలో ఎమ్మెల్యే వున్నారన్నారు. ఈ ఎమ్మెల్యే తన సొంత నిధులు లక్ష రూపాయలు వెచ్చించి గుంతలు పూడ్చలేకపోయారన్నారు. కావలి పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని మాయమాటలు చెప్పడం దుర్మార్గమన్నారు. ఎంపిగా పోటీ చేస్తానని ఓట్లు వేసి గెలిపించాలని చెబుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కావలికి ఏమి చేశారో చెప్పాలన్నారు. కావలికి ఏమి చేయలేని ఆయనకు ఓట్లు ఎందుకు వేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంది బిజెపి మాత్రమేనన్నారు. బస్సు యాత్రలకు జనం రారని పొదుపు మహిళల్ని, ఎన్ఆర్ఇజిఎస్ కూలీలకు డబ్బులు ఇచ్చి మరికొంత మందిని తోలారన్నారు. రౌడీయిజం చేస్తే తాట తీస్తానని ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదంగా వుందన్నారు. ప్రతాప్‌రెడ్డి చుట్టూ వున్న రౌడీలను తాట తీయాలని అప్పుడు జనం నమ్ముతారన్నారు. కావలి నియోజకవర్గాన్ని ఇసుక, గ్రావెల్ పేరుతో వందలాది కోట్లు బెదిరించి దోచుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అధికారులను, మీడియా ప్రతినిధులను అందరిని బెదిరించి దోచుకుంటున్నది ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అన్నారు. రకరకాల పార్టీలు మారిన ప్రతాప్‌రెడ్డి బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరిని విమర్శించడం తగదన్నారు. ఇసుక, మద్యం అక్రమాలపై విజయ్ సాయిరెడ్డిని సూటిగా ప్రశ్నించిన మా అధ్యక్షురాలు పురంధేశ్వరిపై విమర్శలు చేయడం తగదన్నారు. రానున్న ఎన్నికలలో ప్రజలు బుద్దిచెప్పేందుకు సిద్ధంగా వున్నారన్నారు. ఈ సమావేశంలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి మందా కిరణ్, కిసాన్ మోర్చ పట్టణ ప్రధాన కార్యదర్శి ముంగమూరు వెంకటరెడ్డి, బిజెవైయం పట్టణ ప్రధాన కార్యదర్శి కూరాకుల సవీంద్ర, ఎస్సీ మోర్చ పట్టణ ఉపాధ్యక్షుడు కె.మనోజ్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు కోదూరు మురళి తదితరులు పాల్గొన్నారు.

## దోపిడి దొంగల చేతివాటం



**నెల్లూరు క్రైమ్, నవంబర్ 10, ప్రభాత వార్త** నెల్లూరు నగరంలోని బాలాజీ నగ ర్ పోలీసు స్టేషన్ పరిధిలో గత రాత్రి దోపిడి దొంగలు తమ చేతివాటంతో తా ళం వేసి ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసు కొని దొంగతనం చేశారు. పోలీసు స్టేషన్ పరిధిలో రాంజీనగర్ నాల్గో వీధిలో రా జా రవీంద్ర తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇతను వృత్తిరీత్యా బియ్యం కమీషన్ వ్యాపారి. నవంబర్ 9వ తేదీన ఉదయం కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని దర్శిం చుకునేందుకు తమ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం 11గంటలకు తమ ఇంటికి తాళాలు వేసి నెల్లూరు నుండి తిరుమలకు బయలుదేరి వెళ్లారు. దైవదర్శనం అనంతరం మరలా తిరిగి శుక్రవారం ఉదయం 11గంటలకు నెల్లూరు నగరంలోని తమ ఇంటికి చేరుకున్నారు. తలుపులు పగలగొట్టి ఉండటంతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురై ఇంటి లోపలికి వెళ్లి చూడగా ఎక్కడ వస్తువులు అక్కడ చెల్లా చెదిరి ఉండటంతో దొంగతనం జరిగిందని గ్రహించి బాలాజీ నగర్ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. రాజా రవీంద్ర సమాచారం అందుకున్న బాలాజీ నగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ సుమన్ తన సిబ్బందితో కలిసి సంఘటనను పరిశీలించి వెంటనే క్లూస్ టీమ్‌ను కూడా పిలిపించి దొంగతనం చేసిన వారి వేలిముద్రలు సేకరించారు. క్లూస్ టీమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మయ్య కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించి తగిన సాక్షాలు కోసం వెతుకులాట ప్రారంభించారు. అనంతరం సబ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రాజా రవీంద్ర ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకున్న పోలీసులు సుమారు 12 సవర్ల బంగారు ఆభరణాలు, తొమ్మిది కిలోల వెండి సామాన్లతో పాటు రూ.40వేలు నగదు కూడా దొంగతనం జరిగినట్లు తమకు ఫిర్యాదు అందిందని క్లూస్ టీమ్ నివేదిక ప్రకారం విచారణ వేగవంతం చేసి ఈ ఘటనకు ఎవరైతే పాల్పడ్డారో వారిని పట్టుకుని ఫిర్యాదుదారులకు తగిన న్యాయం చేస్తామని తెలిపారు. ముద్దాయిలు తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని వాటిని పొడవైన ఇనుపురాడ్డుతో తలుపులను పలగొట్టి దొంగతనాలు చేసేవారిగా తమ ప్రాధమిక దర్యాప్తులో నిర్ధారించామని తెలిపారు. ఇక్కడ మరొక విషయం ఏమిటంటే దొంగతనం చేసిన ముద్దాయిలు ఎవరో కానీ ఇక్కడ ఎటువంటి ఆనవాళ్ళు దొరకకుండా ఉండేందుకు తలుపులకు వేసిన తాళం బుర్రలను కూడా తమ వెంట తీసుకెళ్లడంతో గతంలో వారికి నేర చరిత్ర ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

## పోలీసు శాఖపై అవగాహన



**నెల్లూరు క్రైమ్, నవంబర్ 10, ప్రభాతవార్త** అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా స్థాయిలో వివిధ పాఠశాలల విద్యార్థులకు, పోలీసుశాఖలో విధులు నిర్వ హించే పోలీసు సిబ్బందికి వేరువేరుగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సమాజం, పోలీసులు, చట్టాల మీద విద్యార్థులకు అవగా హన పెంపొందించడానికి వ్యాసరచన, వకృత్వ పోటీలనుపఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం నగరంలోని స్థానిక ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలను జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి అందజేశారు. చుట్టు పక్కల పరిస్థితులు, విషయ పరిజ్ఞానం, లోకజ్ఞానంపై నిరంతరం అవగాహన పెంచుకోవాలని వివరించారు. ఇదే స్ఫూర్తితో ఉన్నత స్థాయిలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. బహుమతులు పొందిన విద్యార్థులు, వారి తల్లి దండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. వ్యాసరచన పోటీలలో మొదటి మూడు స్థానాలలో నిలిచిన పోలీసు సిబ్బంది.. మొదట స్థానం కే.కవిత దర్గమిట్ట పీఎస్ నందు రూ.5వేలు, రెండో స్థానం ఎస్‌కే మం జన్‌బి, కొండాపురం పీఎస్ నగదు రూ.3వేలు, మూడోస్థానం పి.కుశ్వనాథ్‌కుమార్, స్పెషల్ పార్టీ, నగదు రూ.2వేలు గెలుపొందారు. వీరిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన వేమరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



**నెల్లూరు సిటీ, నవంబర్10, ప్రభాతవార్త** అజ్ఞానాంధకారాలు తొలగి ప్రజలందరి జీవితంలో విజ్ఞాన దీపాలు వెలగాలని జిల్లా పార్టీ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వెమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షిం చారు. ఈ మేరకు వెలుగుల పండుగ దీపావళి సందర్భంగా జిల్లా ప్రజలకు, కార్యకర్తలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరి జీవితంలో చీకట్లు తొలగి వెలుగులు నిండాలని, అందరికీ లక్ష్మీ కటాక్షం కలగానలి ఆయన ఆకాంక్షించారు. ప్రజలు ఆంనదో త్సాహాల మధ్య పర్యావరణరహిత దీపావళి జరుపుకోవాలని ఆయన సూచించారు. చెడుపై మంచి విజయం సాధించినట్లుగానే ప్రతి పనిలోనూ విజయం దక్కాలని ఆయన ఆకాంక్షించారు.